గ్రూప్ - 3 పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

పూడూరు : వికారాబాద్ – మన్నెగూడ రోడ్డు ఎన్కెపల్లి శివారులోని మోడల్ స్కూల్‌లో గ్రూప్ –3 పరీక్షలు రెండు రోజులు నిర్వహించారు. సోమవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థుల గదులు, వైద్య, మౌలిక వసతులను తనిఖీ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్‌తో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రూప్ – 3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

పరీక్షకు 986 మంది హాజరు

పరిగి : పరిగి పట్టణంలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో సోమవారం జరిగిన గ్రూప్ – 3 పరీక్షకు 986 మంది హాజరయ్యారు. పట్టణంలో సోమవారం 1680 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 986 మంది హాజరుకాగా.. 694 మంది గైర్హాజరయ్యారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో 288 మందికి గాను 150, పల్లవి డిగ్రీ కళాశాలలో 360 మందికిగాను 247, న్యూ బ్రిలియంట్ స్కూల్‌లో 240 కిగాను 112, ఓగా బీఈడీ కళాశాలలో 288 మందికి 124 మంది, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 504 గాను 353 మంది అభ్యర్థులు గ్రూప్–3 పరీక్షలకు హాజరయ్యారు.

నేటి నుంచి జిల్లాలో ప్రజా విజయోత్సవాలు

రంగారెడ్డి (నమస్తేతెలంగాణ) : ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడానికి మంగళవారం నుంచి జిల్లాలో ప్రజా విజయోత్సవాలు జరుగనున్నాయి. సోమవారం నుంచి డిసెంబర్ 7 వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టడానికి సాంస్కృతిక మండలి ఏర్పాట్లు చేసింది. ఆరు గ్యారంటీలను సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకరూపంలో ప్రదర్శించనున్నారు. కళాబృందాలు వెళ్లేవిధంగా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు.

కలెక్టరేట్‌లో కళాజాత ప్రారంభం..

జిల్లాలో ప్రజాపాలన, ప్రజావిజయోత్సవాల పేరుతో 19 రోజుల పాటు నిర్వహించనున్న కళాజాతను మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డి కలెక్టరేట్ ఆవరణలో ప్రారంభించనున్నారు.

గిరిజనులపై కాంగ్రెస్ అరాచకం

కులకచర్లలో జీవీఎస్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్, గిరిజన నాయకులను లగచర్లకు వెళ్లకుండా అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న కులకచర్ల ఎస్సై అన్వేశ్‌రెడ్డి

కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు.

సునీల్‌నాయక్‌ను అక్రమంగా అరెస్టు చేస్తున్న పోలీసు

కులకచర్ల, నవంబర్ 18 : ఫార్మాపేరుతో గిరిజనులపై కాంగ్రెస్ అరాచకం చేస్తుందని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ శ్రీనివాస్‌నాయక్ అన్నారు. సోమవారం లగచర్లలో గిరిజనుల పరిస్థితిని తెలుసుకోవడానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న గిరిజన విద్యార్థి సంఘం నాయకులను పోలీసులు పీఎస్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. లగచర్ల ఘటనపై గిరిజనులతో మాట్లాడటానికి.. వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకోవడం పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎవరితోనైనా మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన రాష్ట్రంలో రాక్షస పాలనను తలపిస్తుందన్నారు. కోడంగల్‌లో రేవంత్‌రెడ్డికి గిరిజనులు ఓటు వేసిన తప్పునకు బుద్ధిచెబుతున్నారన్నారు. గిరిజనులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా పేరుతో గిరిజనుల భూముల దగ్గరకు ఎవ్వరూ వెళ్లకూడదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి గిరిజనులే కారణమన్నారు. ప్రభుత్వం వెంటనే గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తివేసి అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతాయని హెచ్చరించారు. జీవీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ రాథోడ్, కులకచర్ల మండల అధ్యక్షుడు ప్రకాశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి గణేశ్‌నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు అంబర్ సింగ్ నాయక్, సేవ్య నాయక్ తది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు అన్యాయం

కడ్తాల్ : కాంగ్రెస్ పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతున్నదని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. వికారాబాద్ జిల్లా, దుద్యాల మండలం, లగచర్లలో సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జలోతు హుస్సేన్ పర్యటన నేపథ్యంలో, కడ్తాల్ మండలంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక నాయకులను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. దశరథ్‌నాయక్ మాట్లాడుతూ.. లగచర్లలోని గిరిజనులకు అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. గిరిజనులకు న్యాయం చేయాలని ఎస్టీ కమిషన్ సభ్యుడ్ని కలువడానికి బయల్దేరిన తమను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. కుట్రలు, కుత్రంతాలు తెలియని అమాయక గిరిజనులపై, రేవంత్‌రెడ్డి సర్కార్ కక్షపూరితంగా వ్యవహరించి జైలుకి పంపడం తగునా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఏ గిరిజనుడికైన అన్యాయం జరిగితే ఆందోళనకు సిద్ధమన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన గిరిజనులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ శారదపాండునాయక్, నాయకులు శ్రీనునాయక్, మహేశ్, అంజిన, శ్రీకాంత్, రాజు, జగన్, రాజేశ్, భీమన్ ఉన్నారు.

గిరిజన రైతు బిడ్డలకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం

దోమ : గిరిజన రైతు బిడ్డలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని దోమ మండల గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు సునీల్‌నాయక్ అన్నారు. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట మండల పరిధిలో ఇటీవల జరిగిన లగచర్ల ఘటనపై గిరిజనులతో మాట్లాడటానికి వెలుతున్న దోమ మండల విద్యార్థి సంఘం నాయకుడు సుకేల్ నాయక్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి దోమ పోలీస్‌స్టేషన్‌కు తరలించడంపై సునీల్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో రాక్షస పాలన చేస్తూ రాజ్యాంగం ఇచ్చిన మాట్లాడే స్వేచ్ఛను హరించి పేదలను వేధిస్తున్నాడని దుయ్యబట్టారు. ప్రజా ఉద్యమ నాయకులను ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తే ప్రశ్నించే వారు ఎవరూ ఉండరని కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి ఘటనలకు పాల్పడుతుందన్నారు. కొడంగల్‌లో రేవంత్‌రెడ్డికి ఓటు వేసిన తప్పునకు గిరిజన రైతులను వారి బిడ్డలను మంచి బుద్ధి చెబుతున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి గిరిజనులపై అక్రమంగా పెట్టిన కేసులను ఉపసంహరించుకొని గిరిజనులకు న్యాయం చేయాలని లేదంటే ఉద్యమం కఠినతరం చేస్తామని హెచ్చరించారు.

బీజేపీ నాయకులు అరెస్ట్

పూడూరు : లగచర్ల గ్రామంలోని ఘటనపై అక్కడి రైతులు, గ్రామస్తులను పరామర్శించడానికి రాష్ట్ర బీజేపీ నాయకుల రాకకు స్వాగతం పలికేందుకు ఉన్నారనే ఉద్దేశ్యంతో సోమవారం చన్గోముల్ పోలీసులు ఓ హోటల్ వద్ద ఉన్న బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. ఈ ఘటన ప్రాంతానికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఈటల రాజేందర్, రాథోడ్ సత్యవతి, స్థానిక చెవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి వస్తున్నట్లు పోలీసులు అనుమానించారు. అందుకే వారికి స్వాగతం పలుకేందుకు స్థానిక బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి, పూడూరు మండలాధ్యక్షుడు రాఘవేందర్, ఇతర జిల్లా పార్టీ నాయకులను ముందస్తుగా పోలీస్ స్టేషన్‌కు తరలించి సాయంత్రం వారిని పంపించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. పోలీసులు అడ్డగించి అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

బీజేపీ నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

బీజేపీ ఎంపీల అరెస్టు

మొయినాబాద్, నవంబర్ 18 : లగచర్లలోని రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న మహబూబ్‌నగర్, మల్కాజిగిరి ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిలను మొయినాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం సాయంత్రం 4:40 గంటల సమయంలో మొయినాబాద్ ఠాణా ఎదుట రోడ్డుపై బారికేడ్లు అడ్డుపెట్టి వారి కారును అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో అక్కడ భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఎంపీలు, ఎమ్మెల్యే అరగంటకు పైగా కారులోనే కూర్చోవడంతో పోలీసులు వారిని బలవంతంగా కిందకు దింపి అరెస్టు చేసి పోలీస్ వాహనాల్లో నార్సింగి ఠాణాకు తరలించారు.

మొయినాబాద్‌లో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డిని అడ్డుకుని అరెస్టు చేస్తున్న పోలీసులు

లగచర్ల ఘటన కాంగ్రెస్ కార్యకర్తల సృష్టే..

లగచర్ల దాడి ఘటనకు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రధాన కారణం. ఆ పార్టీ నాయకులే కార్యకర్తలతో కలెక్టర్, అధికారులపై దాడి చేయించారు. రైతులు, జైలుకు వెళ్లిన రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుంటే పోలీసులు అడ్డుకోవడం తగదు. కాంగ్రెస్ కార్యకర్తలే అధికారులపై దాడులు చేసి..రైతులు చేసినట్లుగా వారిపై తప్పు డు కేసులు పెట్టి జైలుకు పంపడం అన్యాయం. రైతుల కుటుంబాలను పరామర్శిస్తే సీఎంకు ఎందుకంత భయం..?. నా పార్లమెంట్ పరిధిలో ఉన్న రైతుల కుటుంబాలను పరామర్శించే హక్కు లేదా..?. రేవంత్‌రెడ్డి చేస్తున్నది నూటికి నూరు శాతం తప్పే. రైతులను భయపెట్టి వారి భూములను లాక్కోవడం దుర్మార్గం. దాడి జరుగలేదని కలెక్టర్ ప్రతీక్ జైన్ చెప్పిన తర్వాతా రైతులను ఎందుకు జైలుకు పంపిం చారు. రైతులను కలిసేందుకు ప్రజాప్రతినిధులు వెళ్తే ఎందుకు అడ్డుకుంటున్నారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి పోలీస్ ఎస్కార్ట్ ఇచ్చి మరీ రైతుల వద్దకు ఎందుకు పంపిస్తున్నారు. రేవంత్‌రెడ్డికి దమ్మూధైర్యం ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలువాలి..?

-డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎంపీ

ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్‌ను అడ్డుకున్న పోలీసులు

మేము రౌడీలం..గూండాలం కాదు..

ఎంపీల విధులకు పోలీసులు ఆటంకం కలిగించడము నేరమే అవుతుంది. లగచర్ల రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకో వడం ఎంపీల విధులకు ఆటంకం కలిగించడమే. సగం..సగం చట్టం తెలిసిన పోలీసుల ఉండడం సిగ్గుచేటు. లగచర్లకు వెళ్లి రైతు కుటుంబాలను పరామర్శిస్తాం. మేము నిషేధించబడిన సంస్థల ప్రతినిధులం కాదు. రోడ్లపై పనిలేకుండా తిరిగే నాయకులమూ కాదు. రౌడీలం.. గూండాలమూకాదు. బాధ్యత గల పార్లమెంట్ సభ్యులం మమ్మల్ని ఎలా అడ్డుకుంటారు. ప్రజాప్రతినిధులుగా ప్రజలు, రైతులు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సిన బాధ్యత మాపై ఉన్నది. పోలీసులు బాస్‌ల మాటలు విని అడ్డుకుని.. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే దాని ఫలితాన్ని అనుభవిస్తారు.

- ఈటల రాజేందర్, మల్కాజిగిరి ఎంపీ

జిల్లాకు మంచిపేరు తీసుకురావాలి

జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి, నవంబర్ 18 (నమస్తేతెలంగాణ) : అధికారులు అంకితభావంతో పనిచేసి రాష్ట్రస్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాస్థాయి అధికారి పర్సనల్‌గా వారంలో మూడురోజులు కిందిస్థాయిలో శాఖల పనితీరును పరిశీలించటానికి వెళ్లాలని సూచించారు. సమయపాలన పాటించాలని, ఫైల్స్ పెండింగ్‌లో పెట్టకుండా రూల్‌ప్రకారం చేయాలన్నారు. తమ కార్యాలయంలో ప్రతి సోమవారం పురోగతిపై సమీక్షించుకోవాలన్నారు. ఒక్కశాఖను.. ఇంకో శాఖవారు సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, ఏఓ సునిల్, జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు పరిశీలించి..పరిష్కరించాలి

ఆదిబట్ల : ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో తమ సమస్యలు తెలుపడానికి వచ్చిన జిల్లా ప్రజల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులు సంబంధిత శాఖల జిల్లా శాఖల అధికారులు స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ అంశాలపై 41 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెవెన్యూశాఖ 36, ఇతర శాఖలకు 5 మొత్తం కలిపి 41 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రియల్టర్ జోజీరెడ్డి కార్యాలయంలో ఐటీ సోదాలు

కొత్తూరు, నవంబర్ 18 : కొత్తూరుకు చెందిన రియల్టర్, లేబర్ కాంట్రాక్టర్ జోజి రెడ్డి ఇల్లు, కార్యాలయంలో ఐటీ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి సోదాలు నిర్వహిస్తున్నారు. లోపలికి ఎవరినీ అనుమతించడంలేదు. కార్యాలయం లో ఉన్న జోజిరెడ్డిని ఐటీ అధికారులు ప్రశ్నిస్తున్నారని సమాచారం.

డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నాడు

మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాం చంద్రారెడ్డి

తుర్కయాంజాల్ : డైవర్షన్ పాలిటిక్స్‌కు సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపుతున్నాడని మూసీ ప్రక్షాళన, లగచర్ల ఘటనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మన్నెగూడ వేద కన్వెన్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర వర్క్‌షాప్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హా మీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. బీజేపీ ప్రశ్నిస్తుండడంతో సీఎం డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపుతున్నాడన్నారు. 20 మంది బీజేపీ నాయకులు ప్రజలతో కలిసి నిద్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకోని పార్టీకి నివేదికలు అందజేశామని తెలిపారు.1000 అడుగుల విస్తీర్ణంలో ఉన్న మూసీ నదిలో 300 ఫీట్ల వెడల్పుతో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టి సమస్యకు పరిష్కారం చూపవచ్చునని, మిగిలిన దానిలో మూసీ బ్యూటిఫికేషన్ పనులను చేపట్టవచ్చునని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ, బండారు విజయలక్ష్మి, ఎన్‌వీ సుభాష్, సునీతారెడ్డి పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే తనయుడు అభిషేక్‌రెడ్డి దంపతులు

బుగ్గజాతరలో.. భక్తుల సందడి

శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

అనంతపద్మనాభస్వామి జాతరకు వచ్చిన భక్తులు

మంచాల : కార్తిక సోమవారం సందర్భంగా బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర భక్తులతో కిక్కిరిసిపోయింది. మంచాల మండలం ఆరుట్ల గ్రామ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు కార్తిక సోమవారంతో నాలుగోవ రోజుకు చేరుకున్నాయి. కార్తిక స్నానాలు ఆచరిందేందుకు ఉదయం నుంచి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు, ఆర్టీసీ బస్సుల్లో రామలింగేశ్వర స్వామి సన్నిదానానికి చేరుకోని గుండంలో స్నానాలు ఆచరించిన దర్శించుకోని పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో కార్తిక దీపాలు వెలిగించి మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు నెరవేరడంతో భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం పిల్లా పాపలతో భక్తులు జాతరలో ఆనందంగా గడిపారు. ఉదయం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి ఆయన భార్య స్నేహారెడ్డి స్వామి వారిని దర్శించుకోని పూజలు, అభిషేకం చేశారు.

కొనసాగుతున్న అనంత పద్మనాభస్వామి జాతర

వికారాబాద్ : అనంత పద్మనాభ స్వామి పెద్ద జాతర సందర్భంగా సోమవారం భక్తులు భారీగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వికారాబాద్ ప్రాంత ప్రజలే కాకుండా హైదరాబాద్, రంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. కార్తిక మాసం సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి చేరుకొని పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న ఉసిరి చెట్టు కింద దీపాలు వెలిగించి మొక్కులు మొక్కుకున్నారు. స్వామివారి దర్శనానికి 2 గంటల పాటు సమయం పట్టింది. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నాగిళ్లలో పరస్పర దాడి ఇద్దరు మృతి

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రాజు

మాడ్గుల, నవంబర్ 18: పాత కక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడంతో తీవ్రగాయాలై ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన నాగిళ్లలో చోటుచేసుకున్నది. సీఐ జగదీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొజ్జ రమేశ్ రెడ్డి ఫిర్యాదు మేరకు, నాగిళ్ల గ్రామానికి చెందిన బర్కం యాదయ్య (55) 2014లో భార్య సుగుణమ్మను హత్య చేశాడు. అతనికి యావజ్జీవ కారాగారశిక్ష పడింది. చర్లపల్లి జైల్లో 8 ఏండ్లు ఉన్నాడు. మానసిక పరిస్థితి విషమించడంతో ఎర్రగడ్డ మెంటల్ హాస్పిటల్‌లో చికిత్స పొంది, రెండేండ్ల క్రితం జైలు నుంచి విడుదలై ఒంటరిగా ఉంటున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం చేశాడు. కొడుకు అక్క వద్ద ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు యాదయ్య బామ్మర్ది గడ్డం శ్రీను (40) మేడిపల్లి, యాచారం మండలం వాసి, నాగిళ్లకు చెందిన బర్కం చంద్రయ్య బంధువుల ఇంట్లో జరిగే (పిన్నమ్మ) పండుగకు వచ్చారు. బావ అదే గ్రామంలో ఒంటరిగా ఉండడంతో అతనితో మాట్లాడాలని భావించి రాత్రి 7 గంటలకు శ్రీను అక్కడికి వెళ్లాడు.

అతని బావ యాదయ్య కొద్దిసేపు మంచిగా మాట్లాడుకున్న తర్వాత వాగ్వాదం జరగడంతో యాదయ్య.. శ్రీను తల, శరీర భాగలపై కర్ర, రాళ్లతో కొట్టాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే శ్రీను మృతి చెందాడు. యాదయ్యకు కూడా బలమైన గాయాలు కావడంతో అతను మృతి చెందాడు.

గ్రామస్తులు మాజీ సర్పంచ్ బొజ్జ రమేశ్ రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన మరి కొందరితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని చూడగా ఇద్దరు పడిపోయారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వచ్చి పరిశీలించి ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు. మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసిన అనంతరం శ్రీను బాడీని మేడిపల్లికి పంపారు. యాదయ్య మృతదేహాన్ని ఎవరూ తీసుకుపోవడానికి రాక పోవడంతో మున్సిపాలిటీ వారికి అప్పచెప్పినట్లు సీఐ చెప్పారు.

మరణంలోనూ వీడని స్నేహబంధం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

కడ్తాల్, నవంబర్ 18 : వారిద్దరూ ప్రాణ స్నేహితులు.. ఎక్కడికెళ్లినా ఇద్దరూ కలిసే వెళ్తారు.. కలిసి మెలసి తిరిగే వారిని మృత్యువు కబళించింది. మండల కేంద్రంలో సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ప్రమాదానికి సంబంధించి సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన తుప్పరి రాజు (24), సిద్ధిగారి మహేశ్ (24) ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగులు. ఆదివారం రాత్రి ఆమనగల్లులో జరిగిన ఓ శుభాకార్యానికి బైక్‌పై వెళ్లారు. ఫంక్షన్ అనంతరం అదే రాత్రి వారు బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో ఉన్న కడ్తాల్ టోల్‌ప్లాజా సమీపంలో లారీ డ్రైవర్ అజాగ్రత్తగా ఎలాంటి ఇండికేటర్స్, సూచికలు లేకుండా లారీని నిలిపాడు. బైక్ నడుపుతున్న రాజుకు ఆగి ఉన్న లారీ సరిగ్గా కనిపించకపోవడంతో లారీ వెనుక భాగంలో బైక్ బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రాజు, మహేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకోని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం మధ్యాహ్నం నివాళులర్పించారు. మృతుడు రాజు అన్న మహేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ పరామర్శ..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మరణించడంతో కడ్తాల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కడ్తాల్‌కు చేరుకోని, మృతదేహాలపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి మృతుడు రాజు కుటుంబానికి రూ.10 వేలు, మహేశ్ కుటుంబానికి రూ.5 వేలు అందజేశారు. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరుపున మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఐదు వేల చొప్పున రూ.10 వేలు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.10 వేలు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రూ.6 వేలు అందజేశారు. అంతిమయాత్రలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పాల్గొని, మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పీసీబీ సభ్యుడు బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు సమితి మాజీ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, వేణుపంతులు, గంప శ్రీను, లాయక్‌అలీ, రాజేందర్‌యాదవ్, వెంకటేశ్, జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, కృష్ణ, దాసు, అంజి, మహేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, శ్రీను, కృష్ణ, శివ, రమేశ్, కుమార్, సుమన్, సుభాశ్, సైదులు, రాజశేఖర్, సతీశ్ ఉన్నారు.

మృతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి

ఆమనగల్లు, నవంబర్ 18 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపల్లి గ్రామపంచాయతీలోని చెన్నకేశవకాలనీకి చెందిన పరికుప్పల యాదగిరి (45), మర్ల యాదయ్య (42) తల కొండపల్లి మండలంలోని చుక్కపూర్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బంధువుల వివాహ వేడుకకు హాజరై ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణం కాగా.. చింతలపల్లి గ్రామ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ దవా